



పంటలను పరిశీలిస్తున్న ప్రభాకర్ రెడ్డి, నాయకులు

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సంక్షేమ పథకాల ప్రదాత డాక్టర్ వైఎస్. రాజశేఖర్ రెడ్డి అని వైసిపి ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి , ఎం.ఎ.హఫీజ్‌ఖాన్, మేయర్ బివై రామయ్య, పలువురు వైసిపి నాయకులు అన్నారు. డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో, వైఎస్ఆర్. సర్కిల్ లో వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ వైఎస్. రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో నేటికీ జీవించే ఉన్నారన్నారు. సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్ఆర్ అని కొనియాడారు. నిలువెత్తు తెలుగుదనం, సంప్రదాయం ఉట్టి పడే పంచకట్టు, నిత్యం పేదల పక్షాన నిలిచే గుణం రాజశేఖర్‌రెడ్డికే సాధ్యమన్నారు. 108, ఫీజు రీయింబర్‌మెంట్, పావలా వడ్డీ రుణాలు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ ఇలా ఎన్నో అందించి ప్రతి ఒక్కరి గుండెలో, ప్రతి ఇంటి లోగిలిలో ఆయన చిరస్మరణీయులయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, మేయర్ బివై. రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, తెర్నేకల్ సురేందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఎన్.అరుణ, నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, సిహెచ్ మద్దయ్య, సిద్ధారెడ్డి రేణుక, వైసిపి కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌యులో : మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎ. ఆనందరావు రెక్టార్ సివి కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు, ఆయా విభాగాల ప్రొఫెసర్లు నాన్ టీచింగ్ స్టాఫ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చేసిన సేవలను విసి కొనియాడారు

కెవిఆర్ కళాశాలలో : కెవిఆర్. మహిళా డిగ్రీ కళాశాలల లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇంది రా శాంతి , డేనియల్, శారద, గిరిజారాణి, జి.మహబున్‌బాష, ఎస్. మహబూబ్ బాష, మణికంఠ, విద్యార్థినులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఎకరాకు రూ.30 వేల

నష్టపరిహారం చెల్లించాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

వర్షాభావంతో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 30 వేలు నష్టపరిహారం ప్రభుత్వం రైతులకు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రైతు సంఘం మండల అధ్యక్షులు ఆంజనేయులు, మండల నాయకులు బాలపీర, రామకృష్ణ హుస్సేనయ్య, గోపాల్, ఎమ్మెస్ బాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, రైతులతో కలిసి కర్నూలు మండలం గొందిపర్ల, పూల తోట ఇ. తాండ్రపాడు గ్రామాలలో పంట పొలాలను పరిశీలించారు. ఆ సందర్భంగా కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గొందిపర్ల, పూలతోట ఇ. తాండ్రపాడు గ్రామాలలో వందల ఎకరాలు రైతులు సాగు చేశారన్నారు. మొక్కజొన్న, కంది, జొన్నలాంటి ప్రధాన పంటలుగా ఉన్నాయని, రైతులు పంటలు వేసి నెల రెండు నెలలు అవుతుందన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు తీవ్రంగా వాడుబారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయం కల్లా బాగా పెరగాల్సిన పంటలు ఏమాత్రం పెరగలేదన్నారు. రైతు ఎకరానికి రూ.పదివేల నుంచి రూ.20 వేల దాకా ఖర్చు పెట్టారని అన్నారు. తుంగభద్ర నది ద్వారా నీళ్లు ఉపయోగించుకునే రైతులు కొద్దిగా మెరుగ్గా ఉన్నా వర్షం పై ఆధారపడిన రైతులు పూర్తిగా నష్టపోయారని అన్నారు. వెంటనే వ్యవసాయ అధికారులు గ్రామాల పర్యటన చేసి పంట పొలాలు పరిశీలించి ఈ క్రాప్ బుకింగ్ చేయాలని, ఒక ఎకరాకి రూ. 30 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆదిత్య ఎల్ 1 విజయవంతం కావాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇస్రో ప్రయోగించే ఆదిత్య ఎల్‌వన్ ప్రయోగం విజయవంతం కావాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా శాంతి తెలిపారు. శనివారం కెవిఆర్ మహిళా డిగ్రీ కళాశాల లో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సూర్యుడి ఫ్రోటో, క్రియో స్పియర్, అధ్యయనం కొరకు ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయోగించే ఆదిత్య ఎల్ 1 విజయవంతం కావాలని కోరుతూ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇస్రో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. భౌతిక శాస్త్ర అధ్యాపకుడు జి.మహబుబ్ బాష మాట్లాడుతూ... ఆదిత్య ఎల్ 1 ఉపగ్రహం 175 రోజులు అంతరిక్షంలో ప్రయాణించి 15 లక్షల కిలోమీటర్లు దూరంలో సూర్యుని ఎల్ 1 కక్ష చేరుకొని, గ్రహణాలకతీతంగా సూర్యునిలో కలిగే వాతావరణంపై ప్రయోగాలు చేస్తుందని తెలిపారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు శారద, వాసవి, పద్మావతి పాల్గొన్నారు.



రానున్న రోజుల్లో కర్నూలుకు తాగునీటి ఎద్దడి

- సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును సందర్శించిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని 6 లక్షల మంది ప్రజానీకం రానున్న నెలరోజులలో తాగునీరు లేక అలమటించాల్సిన పరిస్థితి ఉంటుందని టిడిపి కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బిటి. నాయుడు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోడుమూరు నియోజకవర్గం పార్టీ ఇన్‌ఛార్జి ఆకెపోగు ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం కర్నూలు నగరానికి తాగునీరందించే మునగాలపాడు సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 3 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ప్రజలు ఉన్నారు. ఇందులో కర్నూలు నియోజకవర్గం 33 వార్డులు, పాణ్యం నియోజకవర్గంలోని 16 వార్డుల, కోడుమూరు నియోజకవర్గం 3 వార్డులు, ఇందులో ఉన్నాయి. పరిస్థితి ఇంత అందోళనకరంగా ఉంటే అధికార వైసిపికి చెందిన ఎంపి, ముగ్గురు ఎమ్మెల్యేలు, నగర మేయర్ ఎందుకు అలసత్వంగా ఉన్నారని ప్రశ్నించారు. మొన్నటికి మొన్న కర్నూలు కార్పొరేషన్ సమావేశంలో మేయర్ బివై. రామయ్య కంటితుడుపుగా సమావేశాన్ని ముగించారు. కర్నూలు తాగునీటి సమస్య గురించి ఏమాత్రం చర్యలు తీసుకోలనే చర్చచేయకపోవడం దారణమని అన్నారు. బచావత్ ట్రిబ్యునల్ తీర్పుననుసరించి తుంగభద్ర నుండి 4 టిఎంసిలు సాగు ,తాగునీటి అవసరాలకు వాడుకునేందుకు వీలు కల్పించిందని గుర్తు చేశారు. జస్టిస్ బ్రిజేష్ కుమార్ తీర్పుకూడా పునరుద్ఘాటించిందని తెలిపారు. ఇందులో 1/2 టిఎంసి నీటిని కర్నూలు నగర వాసుల దాహార్తిని తీర్చేందుకు వీలు కల్పించిందన్నారు. 10 నుండి 20 రోజులలో కర్నూలు నగర ప్రజలకు తాగునీరే లేకుండా పోయే ప్రమాదం పొంచి ఉందని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో 5శాతం నీరు లేకుండా ఖాళీగా ఉందన్నారు. కేవలం 25శాతం మాత్రమే నీరుందన్నారు. కర్నూలు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషిచేయాలని లేని పక్షంలో నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించి స్తంబింపచేస్తామని హెచ్చరించారు. నాయకులు సోమిశెట్టి నవీన్, ఎస్.అబ్బాస్, నర్సింహనాయుడు పాల్గొన్నారు.



ఎస్ఎస్ ట్యాంకును పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ప్రభుత్వాలపై 'సమర భేరి'

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

అటు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ముందుకు సాగుతున్నాయి. అన్నింటి ధరలూ విపరీతంగా పెంచేస్తున్నాయి. కేంద్రంలోని మోడీ సర్కార్ పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసింది. వాటి ఫలితంగా నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయి. రాష్ట్రంలోని జగన్ సర్కార్ కూడా అదే బాటలో ముందుకు సాగుతోంది. విద్యుత్ చార్జీలు పెంచింది. ప్రజలపై మోయలేని భారాలను వేస్తోంది. ఆస్తి పన్ను పెంచింది. చెత్త పన్ను పేరుతో అదనంగా వసూలు చేస్తోంది. వాటితో పాటు రెండు ప్రభుత్వాలూ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సమర భేరి పేరుతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను, ప్రభుత్వాల వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సమస్యలపై సచివాలయాల ముందు ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. 4న మండల కేంద్రాలు, జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టనున్నారు.

ప్రాజెక్టులకు ఆగిన వరద...

జిల్లాలోని ప్రాజెక్టులకు వరద నీటి ప్రవాహం ఆగింది. ఎగువన వర్షాలు కురవకపోవడంతో శ్రీశైలం జలాశయానికి ఎగువ నుండి చుక్క నీరు కూడా రావడం లేదు. ఎగువన వర్షాలు కురవకపోవడంతో తుంగభద్ర జలాశయానికి అతి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. క్రమంగా ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గుతోంది.

జిల్లాలో సిపిఐ బస్సు యాత్ర..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర ఉమ్మడి జిల్లాలో సాగింది. తొలుత నంద్యాలలో రాష్ట్రస్థాయి రైతు సదస్సు నిర్వహించారు. అనంతరం కర్నూలులో బహిరంగ సభ నిర్వహించారు. బస్సు యాత్రకు సిపిఎం, కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు.



బిజెపి, వైసిపిలను ఓడించండి...

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కోడుమూరు

రాబోయే ఎన్నికల్లో బిజెపి, వైసిపిలను ఓడించి దేశాన్ని, రాష్ట్రాన్ని రక్షించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆగస్టు 17 నుండి ఈనెల 8 వరకు జరుగనున్న బస్సు ప్రచార యాత్ర శనివారం కోడుమూరుకు చేరింది. పాత బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడారు. దేశంలో విచ్చిన్నకర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. మత విద్వేషాలు చెలరేగాయని, అవినీతి పెరిగిపోయిందని విమర్శించారు. మైనార్టీలకు దళితులకు ,గిరిజనులకు, మహిళలకు రక్షణ లేదని ఇంత అరాచకత్వం జరుగుతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని తెలిపారు. ఈ దేశంలో ప్రజల కోసం పోరాడే పార్టీ ఏదైనా ఉందంటే అవి కమ్యూనిస్టు పార్టీలేనని తెలిపారు. రైతులకు అవసరమైన సాగునీటి కొత్త ప్రాజెక్టులు కూడా శంకుస్థాపనకే పరిమితం చేశారని, ఇక పాత ప్రాజెక్టుల ఊసే మరిచిపోయారనిగుర్తు చేశారు. కోడుమూరు ప్రాంతంలో తుంగభద్రనది మీద గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తే ఒక కోడుమూరు కాదు కర్నూలు పత్తికొండ, కడప తదితర ప్రాంతాలకు లక్షల ఎకరాల దాకా సాగు, తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. గడచిన నాలుగు సంవత్సరాల నుండి వైఎస్ఆర్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టు మీద ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదన్నారు. ఈ జిల్లాలో అనేక ముఖ్యమైన ప్రాజెక్టులు ఎన్నో ఉన్నాయని వేదవతి ,ఆర్డీఎస్, ఇలా జిల్లాకు నిరంధించే ప్రాజెక్టులను నిధులు కేటాయించడంలో విఫలమయ్యారని అన్నారు. కోడుమూరులో చేనేత కార్మికులు నూటికి 80 శాతం మంది నివసిస్తున్నారని వారందరికీ ఉపాధి కల్పించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. ఇక్కడ సిల్క్ రీలింగ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే చేనేతలకు ఉపాధి కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ముప్పాల నాగేశ్వరావు ,సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లు ఎస్ ఎన్ రసూల్ ,ఎస్,మునియప్ప, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, మండల కార్యదర్శి బి.రాజు తదితరులు పాల్గొన్నారు. **ఆలూరు**కు సిపిఐ బస్సుయాత్ర ఆలూరుకు చేరింది. స్థానిక సిపిఐ నాయకులు ఘన స్వాగతం పలికారు. బస్సు యాత్రకు సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ఆలూరు పాతబస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదవతి గర్జన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడారు. అంతకుముందు కార్యకర్తలు బైక్ ర్యాలీతో వై జంక్షన్ నుంచి సభా స్థలి వరకు వచ్చారు. ప్రజా నాట్యమండలి కార్యకర్తలు పాటలతో అలరించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరవు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సిపిఐ రాష్ట్ర నాయకులు ఓబులేసు, పి.రామచంద్రయ్య, దుర్గాభవాని, లెనిన్ బాబు, శేఖర్, రాజేంద్ర, శివారెడ్డి, జాన్సన్, చంద్రనాయక్, పెంచలయ్య, జిల్లా నాయకులు నబి రసూల్, మునెప్ప, అజయ్ బాబు, భాస్కర్, భూపేష్, మండల నాయకులు రామాంజనేయులు, హోతూరప్ప, శివ, బాష పాల్గొన్నారు.



ఆలూరులో మాట్లాడుతున్న రామకృష్ణ



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న పిబివి.సుబ్బయ్య తదితరులు హసీనాబేగం, మబాష

జనసేన ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా కర్నూలు నగరం నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలో శాంతిరాం, మెడికవర్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించినట్లు జనసేన పార్టీ పాణ్యం నియోజక వర్గ ఇంచార్జ్ చింత సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరంలో 300 మంది వైద్య సేవలను ఉపయోగించుకున్నారు. 50 మంది రక్తదానం చేశారని తెలిపారు. డెంటల్, బిపి షుగర్, ఇసిజి, జనరల్ చెకప్, ఇ ఎన్ టి పరీక్షలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పిబివి సుబ్బయ్య, రాయలసీమ ఉమెన్స్‌వింగ్ కోఆర్డినేటర్ ఎస్ఎండి హసీనాబేగం, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- సి బెళగల్ : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కోడుమూరు నియోజకవర్గం నాయకులు కొత్తకోట మహబూబ్ బాషా నేతృత్వంలో మండల జనసేన నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో ఆర్ఆర్ హాస్పిటల్ వైద్యులు డిఎంఒ సలీమ్, ఆసుపత్రి ఇంచార్జి కిషోర్ సిబ్బంది రక్తపరీక్షలు చేసి సేకరించగా నాయకులు, కార్యకర్తలు అహ్మద్, ఉమర్, డిజె వెంకటేష్, ఫారుక్, కరంట్ మౌనేష్, అబ్దుల్, వాటర్ నాగరాజు, షేక్షవలి, శేఖర్ పాల్గొన్నారు. బైక్ ర్యాలీ, కేక్ కటింగ్, పాలు, పండ్లు పంపిణితో పాటు 98 మంది రక్తదానం చేశారు.

జిజిహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జూనియర్ అసిస్టెంట్ ఎ. శ్రీనివాసులుపై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్టేషనరీ దుకాణాల ధృవీకరణపై, స్టేషనరీ విభాగంలోని స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించబడలేదన్నారు. స్టాక్ రసీదు, రిజిస్టర్‌లలోని నమోదులకు సంబంధించిన వ్యత్యాసాల కారణంగా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు స్టేషనరీ దుకాణాలు సీజ్ చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించి సెక్షన్ క్లర్క్ ఎ.శ్రీనివాసులు 2వ తేదీ నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు విచారణలో పెండింగ్‌లో ఉంచబడ్డారని అన్నారు. ఆసుపత్రిలోని స్టేషనరీ పేపర్ల అవకతవకలపై సమగ్రమైన దర్యాప్తుకు కమిటీని నియమిస్తూ ఉత్తర్వు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిఎస్ఆర్ ఎంఒ డా వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగంజన, ఆసుపత్రి ఎడి, రమేష్ బాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు తగ్గించే వరకూ సమరభేరి

-విద్యుత్ ట్రూఆప్ ఛార్జీలు రద్దు చేయాలి
-ఉపాధి అవకాశాలు పెంచాలి
-రెండో రోజి సచివాలయాల ఎదుట నిరసన

ప్రజాశక్తి- విలేకరులు

ప్రజలపై వివిధ భారాలను తగ్గించాలను, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరిస్తూ సిపిఎం చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా శనివారం కర్నూలు జిల్లా వ్యాప్తంగా రెండోరోజు సచివాలయాల ఎదుట నిరసన తెలిపారు. సచివాలయ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈనెల 4న చేపట్టే కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలని ప్రజలకు సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు.



వినతిపత్రం ఇస్తున్న గఫూర్ మియ్యా , తదితరులు

కర్నూలు హాస్పిటల్: 1, 2వ తేదీలలో సచివాలయాల వద్ద ధర్నా చేశారు. విద్యుత్ బిల్లులను తగలపెట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం న్యూసిటీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా, క్రిష్ణానగర్ కార్యదర్శి ఎం. లక్ష్మయ్య, రవికుమార్, దేవేంద్ర, సి.కోటీ, ఎస్ఎం. బాషా పాల్గొన్నారు.



సచివాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆర్.నరసింహులు, తదితరులు

కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరం లోని ఆయా సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రాలు ఇచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు అధికా రులకు సమస్యలను వివరించారు. ప్రజలపై పెంచిన మోయలేని భారా లను తగ్గిం చాలని డిమాండ్ చేశారు. సచివాలయ అడ్మిన్లు రమాదేవి ఎం.శారద, ఇన్చార్జి అడ్మిన్లు ఎం.రాజు, ఆర్.ప్రశాంత్ మాట్లా డుతూ మీరు ఇచ్చిన అర్జీని ప్రభుత్వం దృష్టికి తీసు కువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సి బెళగల్ : పెంచిన ధరలను వెంటనే తగ్గిం చాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జె.మోహన్, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాముడు, సి.బెళగల్ మండల హమాలీ మండల అధ్యక్షులు అక్బర్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రెండోరోజు సి.బెళగల్ మండల పరిధిలోని సచివాలయ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

కోడుమూరు: సిపిఎం ఆధ్వర్యంలో రెండో రోజు కోడుమూరు సచివాలయాల ముందు ధర్నా చేసి అధికారులకు వినతి పత్రాల సమర్పిం చారు. మునమలకుర్తి సచివాలయంలో గఫూర్ మి య్యా, ఐదవ సచివాలయంలో కె.లక్ష్మన్న , రెండవ సచి వాలయంలో జిపి.వీరన్న, , మూడవ సచివా లయంలో మాచర్ల శ్రీరాములు, ఆధ్వర్యంలో సచివా లయ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు.

తుగ్గలి : తుగ్గలి మండలం రాంపల్లి సచి వాల యంలో సిపిఎం నాయకులు శ్రీనివాసులు ఆధ్వ ర్యంలో నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.

వస్త్రమహల్‌ను ప్రారంభించిన నటి రెజీనా

హాజరైన సాహితీ శేఖర్, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

కర్నూలులోని అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో 'వస్త్రమహల్' వస్త్రదుకాణాన్ని ప్రముఖ నటి రెజీనా కెసాండ్రా శనివారం ప్రారంభించారు. ప్రఖ్యాత కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ కుమార్తె, ప్రముఖ డాన్సర్ సాహితీ శేఖర్, పాణ్యం ఎమ్మెల్యేరాంభూపాల్‌రెడ్డి, కర్నూలుఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్ ఖాన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వస్త్రాభిమానులు అందరూ సకుటుంబంగా విచ్చేసి వస్త్రమహల్‌లోని సంప్రదాయ, పాశ్చాత్య దుస్తులను చూసి కొని ఆనందించాలని రెజీనా, సాహితీ శేఖర్ కోరారు. రెజీనా మాట్లాడుతూ ఈరోజు వస్త్రమహల్ ప్రారంభోత్సవానికి కర్నూలుకు రావడం ఎంతో సంతోషిస్తున్నానన్నారు. ఇంత పెద్ద షోరూంను వెంకటేష్ , రమణ ఇక్కడ తెరవడం అభినందనీయమన్నారు. కుటుంబ వస్త్ర షోరూంను చూస్తుండటం ఇది మొదటి సారిఅని అన్నారు. మొత్తం కుటుంబం కోసం అన్నిరకాల అందుబాటు ధరల్లో కావల్సిన వస్త్రాలు ఇక్కడ ఉన్నాయన్నారు. పెళ్లిళ్లకైతే ఇది వన్‌స్టాప్ షాప్ అని చెప్పుకోవచ్చన్నారు. వస్త్రమహల్ యజమానులకు మంచి నాలెడ్జ్ ఉందని, ఎవరికి ఏం కావాలో వాళ్లకు బాగా తెలుసన్నారు. వస్త్ర మహల్ యజమానులు రమణ, వెంకటేష్‌లకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. నేను ఇక్కడ చూసిన ఒక చీర చాలా ఖరీదు ఉంటుందనుకున్నాను కానీ, చాలా అందుబాటు ధరలో ఉన్నాయి. అందువల్ల దయచేసి ఇక్కడకు రండని అన్నారు. సాహితీ శేఖర్ మాట్లాడుతూ, కర్నూలులో వస్త్రమహల్ గ్రాండ్ ఓపెనింగ్ చాలా బాగుందన్నారు. ఇక్కడ ప్రతి ఒక్క పీస్ .చీరలు, లెహంగాలు అన్నీ చాలా బాగున్నాయన్నారు. వీటి క్వాలిటీ , రిచ్ నెస్ బాగున్నాయన్నారు. భారతదేశం నలుమూలల నుంచి వీటిని తీసుకొచ్చారన్నారు. ఇది ఒకరకంగా భారతీయ సంస్కృతి, ఆధునికతల కలబోతగా కనిపిస్తోందన్నారు. ఇక్కడ ఇలాంటి షోరూం రావడం చాలా బాగుందన్నారు. ఈ పరిసర ప్రాంతాల వాసులందరూ తప్పనిసరిగా ఇక్కడకు రావాలని, ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు మాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.



వస్త్ర మహల్‌ను ప్రారంభిస్తున్న రెజీనా

పొలానికి దారి అడిగితే దాడి

ప్రజాశక్తి-సి బెళగల్ : పోలకల్ గ్రామానికి చెందిన రైతు జమ్మిశెట్టి జమ్మన్న పొలానికి వెళ్లాలంటే దారి లేదని, ఇటుగా వెళ్లనివ్వమంటూ అదే గ్రామానికి చెందిన మానుకింది సోమన్న, భార్య మంగమ్మ కొడుకు హరి దాడి చేసి గాయపరిచారు. ఇదేంటని బాధితుడు జమ్మన్న నిలదీయగా అంతటితో ఆగకుండా కళ్లల్లో కారం చల్లి, కాళ్ళు చేతులు కట్టి పడేయడంతో తప్పించుకొని ఎస్ఐ పీరయ్యను సంప్రదించారు. దీంతో కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

4న జడ్పీలో స్పందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఈనెల 4న సోమవారం జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇంచార్జి కలెక్టర్ నారాపురెడ్డి మౌర్య తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఎం.రాజశేఖర్, రియాజ్, మహబూబ్‌బాష

అమీర్ హైదర్‌ఖాన్‌నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరంలోని 48వ వార్డు అమీర్ హైదర్ ఖాన్ నగర్‌లో రోడ్లు, మురుగు నీటి కాలువలు నిర్మించాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్ నాయకత్వంలో సచివాలయ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఎం.రాజశేఖర్, నగర నాయకులు మహబూబ్ బాషా, రియాజ్ సచివాలయ కార్యదర్శిని కలిసి అమీర్ హైదర్ ఖాన్ నగర్‌లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. దాదాపుగా 20 సంవత్సరాల నుండి పేద ప్రజలు ప్రభుత్వ పోరంబోకు భూమిలో గుడిసెలు వేసుకొని కాపురం ఉంటున్నారని, వారు ఇప్పటికే మౌలిక వసతులకు నోచుకోవడం లేదన్నారు. దీనికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ఎంతోమంది ప్రజాప్రతినిధులు కాలనీ సందర్శించిన సందర్భంగా మౌలిక వసతుల కల్పనలో మీకు ఖచ్చితంగా సహాయపడతామని హామీలు ఇచ్చినా ఇప్పటివరకు ఏ పాలక పార్టీ ప్రతినిధి కూడా పేదలకు మౌలిక వసతులు కల్పించలేకపోయారన్నారు. ఈ మధ్యకాలంలోనే నగర మేయర్ బి వై రామయ్య , కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ కాలనీకి వచ్చి శిలాఫలకాన్ని ప్రారంభించిపోయారన్నారు. వైసిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ కాలనీకి రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తామని హామీ ఇచ్చి వెళ్లినప్పటికీ ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి కాలనీవాసులకు మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వైసిపితోనే రాష్ట్రం సుభిక్షం

- రూ.18 లక్షలతో ఇంటింటికి తాగునీరందిస్తాం
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు

ప్రజాశక్తి- దేవనకొండ


మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు

నాలుగేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. లోకేష్ పాదయాత్రతో రాయలసీమలో వర్షాలు కనుమరుగయ్యాయని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. శనివారం మండలంలోని వెలమకూరు గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. మంత్రి గుమ్మనూరు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. వైసిపి గ్రామ నాయకులు రామచంద్ర ఆధ్వర్యంలో మహిళలు పాల్గొని పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల పాలనలో వెలమకూరు పంచాయతీకి రూ.9 కోట్ల సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. గ్రామంలో రూ.18 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి ప్రతి ఇంటికీ తాగునీరందిస్తామని హామీ ఇచ్చారు. గడపగడపకు మంజూరయ్యే నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహశీల్దార్ వెంకటేష్ నాయక్, ఎఒ సురేష్ బాబు, ఎపిఒ కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్, పిఆర్ ఎఇలు మురళీ విజయ్, ఉదయ్ కుమార్, గుమ్మనూరు సోదరులు నారాయణస్వామి, శ్రీనివాసులు, జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి భర్త లుముంబా, వైసిపి మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, వైసిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి, హంపి రెడ్డి, రాజారెడ్డి, దివాకర్ నాయుడు, నారాయణరెడ్డి, టోపీ యూసుఫ్ బాష, గుండు రంగస్వామి, తెర్నేకల్ రాఘవేంద్ర, ఆంజనేయులు, చంద్రన్న, కొత్తపేట బాబు పాల్గొన్నారు.

పదోన్నతి, బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - నందవరం


మాట్లాడుతున్న యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి

మండలంలో కొన్నేళ్లుగా వివిధ పాఠశాలల్లో పని చేసి పదోన్నతి, బదిలీ అయిన ఉపాధ్యాయులను యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల (స్పెషల్)లో ఎన్.నాగరాజు అధ్యక్షతన సన్మానం చేశారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒలు సుదర్శన్ రెడ్డి, రఘునాథ్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడారు. మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పాఠశాలల్లో పని చేసి విద్యాభివృద్ధికి కృషి చేసిన వారిని సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉందని తెలిపారు. పాఠశాల విలీనం వల్ల ప్రాథమిక విద్యావ్యవస్థ కనుమరుగైందని చెప్పారు. మరో ఐదేళ్లు విద్యారంగంలో ఈ సంస్కరణలు అమలైతే ఉన్నత పాఠశాలలు కూడా కనుమరుగవుతాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.ఎల్లప్ప మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు దావీదు, దేవపాల్, మండల నాయకులు అబ్దుల్ రహిమాన్, బాబురాజు, దుబ్బన్న, విరుపాక్షి, జె.రంగన్న, నరసింహులు, సురేష్, పద్మావతి, నరసింహులు, కె.రాజు, భాగ్యరాజు, మద్దయ్య, ఈరన్న, పరమేష్, రామకృష్ణ, ధర్మన్న పాల్గొన్నారు.

12న 'రావుస్'లో జాబ్ మేళా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి కోరారు. ఈనెల 12న రావుస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించే మెగా జాబ్‌మేళా గోడపత్రికలను, కరపత్రాలను శనివారం ఎమ్మెల్యే నివాసంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ జాబ్ మేళాను నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ, రావుస్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ కంపెనీలు హెటిరో డ్రగ్స్, హీల్ మై ఫ్యామిలీ, అమర్ రాజా బ్యాటరీస్, అరబిందో ఫార్మా, నవభారత్ ఫర్టిలైజర్స్, ఫ్లిప్ కార్ట్, డి మార్ట్, శ్రీరామ్ చిట్స్ లైఫ్ ఇన్స్యూరెన్స్, మహేంద్ర హోమ్ ఫైనాన్స్, మెడిప్లస్ ఫార్మసీ, సిటెక్ ప్రయివేట్ లిమిటెడ్, ఎస్‌కె బయో ఎంటర్‌ప్రైజెస్, స్పందన స్ఫూర్తి, వివిధ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 12న నేరుగా బయోడేటా, సర్టిఫికెట్లతో రావుస్ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి.శ్రీకాంత్ రెడ్డి, రావుస్ డిగ్రీ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి పాల్గొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు www.apssdc.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాల కోసం 9985496587, 7799494856, 7799921656 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ చార్జీలు పెంచవద్దు

- స్మార్ట్ మీటర్లు వద్దు...

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరి వీడాలని, విద్యుత్ చార్జీలు పెంచవద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు, జిల్లా నాయకులు గోవిందు డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలోనూ పంపుసెట్లకు, గృహ అవసరాలకు ఇంటి మీటర్లను స్మార్ట్ మీటర్లుగా మార్చవద్దని కోరారు. శనివారం సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని 17, 18, 19, 29, 30, 31వ వార్డు సచివాలయాల్లో కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇప్పటికే అధిక ధరలు, ఆస్తి పన్ను, చెత్త పన్ను, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు నిరాశ కలిగించి, యువతను పక్కదోవ పట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రంగప్ప, రైతు సంఘం నాయకులు లక్ష్మీనరసయ్య, అబ్దుల్లా, రాముడు, పౌర హక్కుల సంఘం నాయకులు డాక్టర్ గణేష్, ప్రజా సంఘాల నాయకులు గోపాల్, పరమేష్, రామాంజి, సోమన్న, అక్బర్, ఎర్రన్న, అన్వర్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని 4 సచివాలయాల కార్యదర్శులకు వినతిపత్రం సమర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, నాయకులు కరుణాకర్, ఖాజా, ఈశ్వరయ్య, మారేష్ పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని తెర్నేకల్, కోటకొండ, కుంకనూరు సచివాలయంలో వినతిపత్రాలు అందజేశారు. సిపిఎం మండల నాయకులు మహబూబ్ బాషా, కుంకనూరు శ్రీనివాసులు, నాయకులు గాజుల శ్రీనివాసులు, లక్ష్మిరెడ్డి, నాగరాజు, రసూల్ పాల్గొన్నారు. **కోసిగి** మండలంలోని సజ్జలగుడ్డం, జంపాపురం గ్రామ సచివాలయం ముందు ధర్నా చేపట్టారు. సజ్జలగుడ్డంలో డిజిటల్ అసిస్టెంట్ వినోద్‌కు, జంపాపురంలో ఎంపిఇఒ మేరీకి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కన్వీనర్ రాముడు, మండల కమిటీ సభ్యులు వీరేష్, నరసప్ప, సిద్ధరామయ్య, సూర్య ప్రకాష్, వీరేష్, తిక్కయ్య, ఉమేష్, బసప్ప, శంకర్, తాయన్న, మహ్మద్, మహబూబ్, భీమేష్, కిష్టప్ప, ప్రకాష్, హనుమంతు, నరసప్ప పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలో నారాయణపురం సచివాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు వినతిపత్రం అందజేశారు. దొడ్డనకేరి, మాంత్రికి సచివాలయల దగ్గర మండల కార్యదర్శి లింగన్న, గనేకల్, బల్లెకల్ సచివాలయాల దగ్గర మండల కార్యదర్శి వర్గ సభ్యులు వీరారెడ్డి, జె.రామాంజనేయులు, బసరకోడు సచివాలయం దగ్గర ఎం.ఉచ్చీరప్ప వినతిపత్రం అందజేశారు. సిపిఎం శాఖ కార్యదర్శులు జి.రంగనాథ్, కె.పాండురంగ, కె.గోవిందు, రామాంజనేయులు, దస్తగిరి బాషా, వీరేష్, పార్టీ సభ్యులు దొడ్డనకేరి మునిస్వామి, ఈరన్న, బసరకోడు మునిస్వామి పాల్గొన్నారు. **ఆదోని** సచివాలయం ముందు నిరసన చేపట్టారు. పట్టణంలోని కల్లుబావి, వైఎస్ఆర్ నగర్, శంకర్ నగర్, అమరావతి నగర్, క్రాంతి నగర్, ఎంఎం కాలనీ, ఇందిరానగర్, బోయగేరి, నిజాముద్దీన్ కాలనీ, హనుమాన్ నగర్ సచివాలయాల్లో వినతిపత్రం అందజేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, ముక్కన్న, పట్టణ కమిటీ నాయకులు వీరేష్, కృష్ణమూర్తి, నాగేంద్ర, శ్రీనివాసులు, నాగరాజు, ఎక్బాల్, నాగరాజు, గౌస్, మల్లయ్య, ఉరుకుంద, హరి, మహ్మద్, అంజిని పాల్గొన్నారు. **నందవరం** మండలంలోని గురజాల గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల నాయకులు దేవపుత్ర, రాయచోటి శాఖ కార్యదర్శి స్వామిదాసు, నాయకులు నల్లన్న, శ్రీరాములు, దేవదాసు పాల్గొన్నారు. **పెద్దకడబూరు** సచివాలయం-1, 2, కల్లుకుంట సచివాలయం ఎదుట నిరసన చేపట్టి, వినతిపత్రాలు అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, పరమేష్, ఉప్పర ఈరన్న, దేవదాసు, నాయకులు జీవ, రామాంజనేయులు, పెద్దయ్య పాల్గొన్నారు.


ఆదోనిలో మాట్లాడుతున్న వెంకటేశులు

ఘనంగా పవన్ పుట్టినరోరోజు వేడుకలు

ప్రజాశక్తి - కోసిగి

పట్టణంలో జనసేన మండల అధ్యక్షుడు రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రాలయం ఇన్‌ఛార్జీ లక్ష్మన్న, డాక్టర్ నజీర్ హాజరయ్యారు. కోసిగి ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులకు, బాలింతలకు పాలు, పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. చిరంజీవి సీనియర్ అభిమాని ఉస్మాన్ ఘని బాలింతలకు సంబంధించి సెమీ ఫౌలర్ మన్యల్ మంచాన్ని విరాళంగా అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నర్సింగ్ ఆఫీసర్స్ విద్యావతి, రాఘవేంద్ర, మండల అభిమాన నాయకులు రమేష్, చందు, అంజి, వక్రాణి వెంకటేష్, సురేష్, శేఖర్, మధు, ఈరన్న, రాము, నరసింహా, ప్రశాంత్, రాకేష్, నవీన్, ముస్తఫా పాల్గొన్నారు. **ఆస్పరి**లోని గాంధీ పార్కులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. 35 మంది దాతలు రక్తదానం చేశారు. జనసేన మండల నాయకులు అరవింద్, బడేసాబ్, నాయకులు శివ, సాయి, హనుమేష్, ప్రసాద్, మంజు, వీరేష్, కార్తీక్, వినోద్, మనోజ్, ప్రతాప్, రంజిత్, మధు, చంద్ర, శీను, కల్యాణ్, కుమార్, ఉదయ్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రేఖగౌడ్ భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం జనసైనికులు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. జనసేన నాయకులు గానిగ బాషా, మాలిక్, సుభాన్, భాస్కర్, గబ్బర్, దూద్ పీరా, ఇస్మాయిల్, నరసింహులు, కృష్ణ పాల్గొన్నారు. **హోళగుంద** మండలం ఇంగలదహల్ గ్రామంలో సందర్భంగా జనసేన యూత్ సభ్యులు సుభాన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆదోని గోపి ఛారిటబుల్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. భారీ సంఖ్యలో యువకులు పాల్గొని రక్తదానం చేశారు. దూద్ పీరా, అలీ, ఆలంబాష, సిద్ధు, కెసిటిఆర్ యూత్ సభ్యులు రాజేష్, పాండు, శ్రీను, ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు. **నందవరం** పాత నీళ్ల ట్యాంకు దగ్గర అభిమానుల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల ఇన్‌ఛార్జీ ఎల్లప్ప, జనసేన నాయకులు చంద్ర, అంజి, ఇసాక్, విజ్జు, ప్రణీత్, నితీష్ పాల్గొన్నారు.


కోసిగి ఆస్పత్రికి మంచం విరాళంగా ఇస్తున్న నాయకులు


గోనెగండ్లలో కేక్ కట్ చేస్తున్న రేఖ గౌడ్


ఆస్పరిలో రక్తదానం శిబిరం నిర్వహిస్తున్న నాయకులు

ప్రపంచ దేశాల్లో దేశ కీర్తి పతాకం

- పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ప్రపంచ దేశాల్లో భారతదేశం కీర్తి పతాకాన్ని ఎగురవేసిందని పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు శాస్త్రవేత్తలను అభినందించారు. శనివారం శ్రీరాఘవేంద్రస్వామి మహా రథోత్సవం పైనుంచి ఆయన మాట్లాడారు. విశ్వగురువైన శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు దిగ్విజయంగా జరగడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు శ్రీమఠానికి సహాయ, సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. పోలీసు, విద్యుత్, పంచాయతీ, ఇతర శాఖల అధికారులకు, శ్రీమఠం సిబ్బందికి ఆశీస్సులు అందించారు. శ్రీమఠంలో పని చేస్తున్న ఉద్యోగులకు పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు శుభవార్త చెప్పారు. శ్రీమఠంలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు 5.5 డిఎ పెంచుతున్నామని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఇప్పుడు ఇస్తున్న జీతాలపై అదనంగా రూ.2 వేలు, శ్రీమఠం నిర్వహణలో ఉన్న శ్రీపరిమళ విద్యానికేతన్ ఉద్యోగులకు అదనంగా రూ.500 పెంచి ఇవ్వడం జవ్వనున్నట్లు చెప్పారు. శ్రీమఠం అభివృద్ధికి సహకరిస్తున్న శ్రీమఠం సిబ్బందిని అభినందించారు.

జన సంద్రం మధ్య రాఘవేంద్రుని మహా రథోత్సవం

శ్రీరాఘవేంద్రస్వామి మహా రథోత్సవం జన సంద్రంగా మారింది. రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల్లో భాగంగా ఉత్తరారాధన, రాఘవేంద్రుని పూర్వారాధన సందర్భంగా ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులును శ్రీమఠం ఆధీనంలో ఉన్న శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం నుంచి పల్లకిలో ఉంచి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం చేరుకుంది. అనంతరం మహా రథోత్సవంపై ఉంచి పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. భక్తజన సందోహం మధ్య కళాకారులు వివిధ వేషధారణలో, వివిధ సంగీత వాయిద్యాల నడుమ రాఘవేంద్ర సర్కిల్స్ మీదుగా ఊరేగిస్తూ మళ్లీ శ్రీమఠం ఆవరణం చేరుకున్నారు. ఈ సందర్భంగా హెలికాప్టర్ ద్వారా పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రథోత్సవంపై ఐదు రౌండ్లతో పుష్ప వర్షం కురిపించారు.



శ్రీమఠం ఆధ్వర్యంలో ఘనంగా వసంతోత్సవం

శ్రీమఠంలో వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులును గురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం నుంచి పల్లకిలో ఊరేగించి శ్రీమఠం చేరుకున్న అనంతరం రాఘవేంద్రుని మూల బృందావనం నుంచి విశేష పూజలు నిర్వహించి ఒకరికొకరు రంగులు వేసుకుని ఆనందోత్సవాల మధ్య వసంతోత్సవం నిర్వహించారు. శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనానికి పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మహా పంచామృతాభిషేకం అభిషేకం నిర్వహించారు. రాఘవేంద్రుని బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో మహా పంచామృతాభిషేకం నిర్వహించారు.

రాఘవేంద్రుని సన్నిధిలో వైసిపి, టిడిపి నాయకులు

శ్రీరాఘవేంద్రస్వామిని వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి దర్శించుకున్నారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై ఆలయం చేరుకున్న వారు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మహా రథోత్సవం సందర్భంగా పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు నాయకులు, కార్యకర్తలపై రంగులు వేసి ఆశీస్సులు అందించారు. ప్రదీప్ రెడ్డి రథోత్సవానికి గుమ్మడికాయ కొట్టి దిష్టి తీసిన అనంతరం పూజలు నిర్వహించారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి భీమయ్య, నాయకులు జనార్ధన్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ స్వామి, బీసీ నియోజకవర్గ అధ్యక్షులు అమర్‌నాథ్ రెడ్డి, బీసీ జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహులు, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామిరెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధికి ఆమడ దూరంలో 'విజయనగర్ కాలనీ' : టిడిపి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని విజయనగర్ కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ తెలిపారు. శనివారం 'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా కాలనీలో పర్యటించి కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాలనీలో రోడ్లు, తాగునీటి పైపులైన్, డ్రైయినేజీ సౌకర్యాలకు ఏర్పడి 25 ఏళ్లయినా నేటికీ నోచుకోలేదన్నారు. తాగునీటి ట్యాంకర్ నాలుగు రోజులకు ఒక ట్యాంకర్ రావడం బాధాకరమన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేకపోతే కాలనీవాసులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, వడ్డేమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, గుడిసె లక్ష్మయ్య, సయ్యద్ వసీం ఖాద్రీ, జిల్లా తెలుగు యువత నాయకులు గుడిసె రామకృష్ణ, సాధిక్ వలీ, బాబురావు, ఢణాపురం నాగిరెడ్డి, మండిగిరి నాగేంద్ర, భరత్, ఇందిరానగర్ వీరేష్ పాల్గొన్నారు.

భక్తుల నిలువు దోపిడీ...

- కౌలుట్ల స్వామి ఆలయంలో సిబ్బంది చేతివాటం


ప్రజాశక్తి- దేవనకొండ


శ్రావణ మాసోత్సవాల సందర్భంగా కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో కొలువైన శ్రీకౌలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయంలో అర్చకులు, సిబ్బంది భక్తులను నిలువు దోపిడీకి చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మూడో శనివారంలో భాగంగా స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీనిని ఆసరాగా తీసుకున్న ఆలయ సిబ్బంది అధిక వసూళ్లకు పాల్పడడం దారుణమని భక్తులు వాపోయారు. దుకాణ సముదాయాల వ్యాపారులు సైతం అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. స్వామి వారి దర్శనానికి, టెంకాయ సమర్పణకు టికెట్టు ధర రూ.5 ఉంటే రూ.10 అదనంగా, వెంట్రుకల సమర్పణకు ఒక గుండుకు రూ.10 ఉంటే అదనంగా రూ.100 వసూలు చేయడం దారుణమని వాపోయారు. సంబంధిత శాఖ అధికారులు అదనపు వసూళ్లకు పాల్పడే ఆలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే తనయుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ ఆదోని ఏరియా ఆస్పత్రి వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చి కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. అలాగే మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబలం, మండిగిరి, సంతేకుడ్లూరు, చిన్నహరివాణం, విరుపాపురం, కుప్పగల్, జాలమంచి తదితర గ్రామాల్లో నివాళులర్పించారు. సర్పంచి రాము, మెడికల్ నాగరాజ్, బిపి.బలరాం, కర్రెప్ప, మారెప్ప, బసప్ప, సున్నుసాబ్, మర్లింగప్ప, లింగన్న, సర్పంచి ఉచ్చీరప్ప, నాయకులు బసవరాజ్, మండగిరి మాజీ సర్పంచి శేషిరెడ్డి, సంతేకుడ్లూరు సర్పంచి ధనలక్ష్మి, నాయకులు భీమా, విరుపాపురం గ్రామంలో జడ్‌పిటిసి అరుణమ్మ, సర్పంచి ప్రహ్లాద యాదవ్, మాజీ జడ్‌పిటిసి ఆనంద్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ నీలకంఠప్ప, పట్టణ కార్యనిర్వహణ అధ్యక్షులు దిలీప్ ధోకా, రాష్ట్ర యువజన కార్యదర్శి మారుతి రావు, దేవిశెట్టి వీరేష్, శ్రీనిత్, నిస్సార్ అహ్మద్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని మండల కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్తూ వైఎస్ఆర్ సర్కిల్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, గజమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సోమప్ప సర్కిల్‌లో వైఎస్.రాజశేఖర్ రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ రఘు, వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు. **చిప్పగిరి** జడ్‌పిటిసి విరుపాక్షి స్వగృహంలో ఆధ్వర్యంలో వైసిపి నాయకులు సమక్షంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిప్పగిరి సచివాలయంలో సర్పంచి గోవిందరాజులు, వైసిపి సీనియర్ నాయకులు ధర్మేంద్ర, పంచాయతీ కార్యదర్శి బాలన్న పూలమాల వేసి నివాళులర్పించారు. **చిప్పగిరి**లో ఎంపిపి జూటూరు హేమలత మారయ్య దంపతులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బెల్డోన, తిమ్మాపురం, ఆస్పరిలో జరిగిన వివాహ వేడుకలకు ముఖ్య అతిథులుగా వెళ్లి నూతన వధూవరులకు తలంబ్రాలు వేసి ఆశీర్వదించారు. ఉరవకొండ ఇన్‌ఛార్జీ విశ్వేశ్వర్ రెడ్డి కొడుకు ప్రణయ్ రెడ్డి. విడపనకల్లు ఎంపిపి భీమ్ రెడ్డి, గడేకల్లు సర్పంచి అంపయ్య, మురళీ, శివశంకర్, వలీ, రాజు పాల్గొన్నారు. **దేవనకొండ** బస్టాండ్ సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి సీనియర్ నాయకులు, తెర్నేకల్ కొత్త కాపు మధుసూదన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జడ్‌పిటిసి కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, స్థానిక ఎంపిటిసి తపాల శ్రీనివాసులు, తెర్నేకల్ మాజీ సర్పంచి రాజన్న, వైసిపి మండల బూత్ కన్వీనర్ సత్యరాజులు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. **కౌతాళం**లో వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాదాచారి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కౌతాళం సర్పంచి పాల్ దినాకర్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, మాజీ సర్పంచి అవతారం, చౌదరి బసవ, ఉప సర్పంచి సక్కిరి తిక్కయ్య, పాఠశాల ఛైర్మన్ వడ్డే రాము, సత్యప్ప స్వామి, రాజా మధు, సమ్మద్, వెంకటరామా రావు, చిన్న ఉసేని, షేక్షావలీ, రామకృష్ణ, వీరేష్, రాముడు, చిన్న జమ్మయ్య, వీరేశ్, పాల్గొన్నారు. **పెద్దకడబూరు** బస్టాండ్ ఆవరణలో వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, దొడ్డిమేకల సర్పంచి, మాజీ ఎంపిపి రఘురాం, సర్పంచి రామాంజినేయులు, సచివాలయం కన్వీనర్ రవిచంద్రా రెడ్డి, వైసిపి నాయకులు జాము మూకయ్య, బ్రహ్మయ్య, ముక్కరన్న, అర్లప్ప, తిక్కన్న, శాంతి, రామాంజి, దస్తగిరి, మునిస్వామి, ఆంజనేయ పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


చిప్పగిరిలో నివాళులర్పిస్తున్న జడ్‌పిటిసి విరుపాక్షి


వధూవరులతో జూటూరు హేమలత మారయ్య దంపతులు

ట్రాన్స్‌పోర్ట్ కార్మికులపై వేధింపులు అరికట్టాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

దేశంలో, రాష్ట్రంలో కీలక రంగమైన రవాణా రంగంలోని ఆటో ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు ప్రజలకు ఎల్లవేళలా ఉపయోగపడతారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, ఎపి ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, సిఐటియు తాలూకా కార్యదర్శి బి.రాముడు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎద్దుల మార్కెట్ రోడ్డులో కనకవీడు ఆటో స్టాండ్ వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోలీసులను అడ్డుపెట్టుకొని చలానా పేరుతో రూ.కోట్లు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఆటో కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం విఫలం చెందాయని విమర్శించారు. కార్మికులంతా ఐక్యంగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు గోవిందు, లక్ష్మీ నరసయ్య, ఆంథోని, రామన్న, ఆటో యూనియన్ నాయకులు కృష్ణ, ఈరన్న గౌడ్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

గౌరవాధ్యక్షులుగా బి.రాజు, అధ్యక్షులుగా మోహన్ దాస్, ఉపాధ్యక్షులుగా రాజశేఖర్, లక్ష్మీకాంత, ప్రధాన కార్యదర్శిగా షబ్బీర్, సహాయ కార్యదర్శిగా దేవదాస్, ప్రభాకర్, కోశాధికారిగా రంగప్ప, మరో 11 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.


సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

రైతన్నల... ఆశలు ఫలించేనా?

- కెసి కెనాల్ కింద జోరుగా వరి నాట్లు
- నీళ్లు వస్తాయో.. లేదోనని భయపడుతూనే సాగు
- అవగాహన కల్పించలేకపోయినా అధికారులు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలంలోని కెసి కెనాల్ ఆయకట్టు కింద నీళ్ల వస్తాయో.. రావో.. అని భయ పడుతూనే వరి సాగుకు రైతులు సిద్ధ పడుతున్నారు. ఈ సంవత్సరం ఆశించినంత వర్షాలు లేక పోవడంతో కెసి కెనాల్‌కు నీళ్ల రావని అధికార యంత్రాంగం మొదటి నుండి వార్తపత్రికల ద్వారా, వివిధ చానాల్స్ ద్వారా తెలియజేయడంతో ఇక ఖరీఫ్ కష్టేమే అని ఆరు తడి పంటల కొరకు రైతన్నలు తమ పొలాలు సిద్ధం చేసుకొని ఉంచారు. నార్లు పోసి పెంచి నిరాశతో ఉన్న రైతులకు ప్రజాప్రతినిధులు అధికారు లతో మాట్లాడి ప్రభుత్వం అనుమతితో కెసి కెనాల్‌కు నీరు విడుదల చేయిం చడంలో సఫలం కావడంతో కెసికి దాదాపు ఆరు అడుగులు నీళ్ల రావడం తో రైతు కళ్ళల్లో ఆనందం పెల్లు విరిసింది. తమ పొలాలు నీటితో తడిసి ముద్దయ్యాయి. అప్పటికే నారు పెరిగి నాటు వెయ్యడానికి సిద్ధంగా ఉండటంతో కెసి కెనాల్ ఆయా కట్టు కింద జోరుగా వరి నాట్లు ఊపందు కున్నాయి. ఇప్పటికే మండలంలోని కెసి కెనాల్ ఆయా కట్టు కింద ఉన్న గ్రామాలు కొత్తపల్లి, బిళ్ళలాపురం, పొన్నాపురం, నూనెపల్లి, చాబోలు చాపిరేవుల,



నాటడానికి పొలం సిద్ధం చేస్తున్న రైతు



వరి నాట్లు వేస్తున్నమహిళ కూలీలు



నార కట్టలు కడుతున్న మహిళ కూలీలు

కానాల వంటి గ్రామాల్లో వరి సాగు చేస్తున్నారు. కెసికి నీళ్ల బంద్ చేస్తామని ప్రభుత్వ యంత్రాంగం ప్రకటన చెయ్యడంతో ఖరీఫ్‌లో వరి సాగేనా అని అన్నదాత ఆలోచనలో పడ్డాడు. వరి వరకు నీళ్ల వచ్చి అన్న దాతల ఆశల వరి అలిస్తుందా? లేక నీళ్ల రాక.. వరిపైర్లు ఎండు తాయా? అన్న ఆలోచనలు రైతులను వెంటాడుతన్నాయి.

పైన దేవుణ్ణి.. కింద భూమి ని నమ్ముకున్నాము



ప్రస్తుతం కెసి కెనాల్‌కు నీరు పుష్కలంగా వస్తున్నాయి. కాబట్టి నేలను నమ్ముకున్న వాళ్ళము దేవుడి మీద భారం వేసి ఎనిమిది ఏకరాలు వరి సాగు చేసాను. నారు పెంచాడానికి, దమ్ము చెయ్యడానికి ట్రాక్టర్ బాడు గులు, నాటు కూలీలు, ఎరువులకు దాదాపుగా ఎకరానికి ప్రస్తుతం ఇరవై వేల వరకు ఖర్చు చెయ్యడం జరిగింది. నీళ్ల రాకపోతే లక్ష అరవై వేల రూపాయలు నష్టం వచ్చే అవకాశం ఉంది.

- పి.నాగ లింగేశ్వరరెడ్డి, కొత్తపల్లి గ్రామం.

నలుగురితో పాటు..



రైతులు నార్లు నాటడానికి సిద్ధంగా ఉండడంతో కెసి కెనాల్ తూము లు ఎత్తి నీళ్ల వదలడంతో ఒకరిని చూసి ఒకరు నాట్లు వెయ్యడం మొదలు పెట్టారు. అందుకే నలుగురితో పాటు తాము నాట్లు వేశాము. అధికారులు ఒక దండోరా వేయించి నీళ్ల రావని కచ్చితంగా చెప్పి, వరి సాగు చెయ్యొద్దు అని రైతులకు అవగాహన కల్పించలేదు. దీంతో రైతులు ఒకరిని చూసి ఒకరు వరి సాగు చేస్తున్నాము.

- భూమా రామకృష్ణారెడ్డి, బిళ్ళ లాపురం గ్రామం.

ఆరు తడి పంటలు వేసుకోండి



ఈ ఏడాది మొదటి నుండి వర్షాలు సరిగా కురువక ప్రాజెక్టులలో నీరు లేదు. మొదటి నుండి పత్రిక ప్రకటనల ద్వారా ఆరు తడి పంటలు వేసుకోండి అని వరి సాగు చేసి నష్ట పోవొద్దు అని ప్రభుత్వ యంత్రాంగం రైతులకు అవగాహనా కల్పిస్తూనే ఉంది.

- ప్రసాద రావు, మండలవ్యవసాయ అధికారి.

ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రస్తుత వర్షాభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు వేసుకునేలా ప్రోత్సహించాలని, జగనన్న లేఔట్లలో గృహ నిర్మాణాలతో పాటు ఆర్బీలు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పనులు లక్ష్యం మేరకు నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి ఏపీ సెక్రటేరియట్ నుండి వర్చువల్ విధానంలో రెవెన్యూ అంశాలైన రీ సర్వే, 4జి టవర్స్, జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ, జగనన్నకు చెబుదాం, వ్యవసాయ శాఖ, మిల్లెట్ ప్రోత్సాహకం, జగనన్న పాల వెల్లువ, పశు సంవర్ధక శాఖ, పంచాయితీరాజ్, రూరల్ డెవలప్మెంట్ కింద ప్రాధాన్యతా భవనాల పురోగతి, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సిఎస్ విసి అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యం లో రైతులు ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలు వేసుకునేలా ప్రోత్సహిం చాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. సాగు చేసిన పంటలకు ఈ నెల 15 లోపు ఈ క్రాఫ్ బుకింగ్‌తో పాటు ఈ కేవైసీ పూర్తి చేయాలన్నారు. జగనన్న లేఔట్లలో లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు ఆర్బీల నిర్మాణాలు పూర్తి కావాలని కలెక్టర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల పనులు కూడ నిర్దేశిత గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వే గ్రామాల్లో నిర్దేశించబడిన లక్ష్యాలను క్షేత్ర స్థాయి గ్రౌండ్ ట్రూతింగ్, విలేజ్ సర్వేయర్ లాగిన్, తహసీల్దార్ లాగిన్, ఫైనల్ ఆర్ ఓ ఆర్, రాళ్ళు నాటే కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేలా ప్రణాళికా బద్ధంగా అధికారులు పని చేయాలని సూచించారు. స్పందన అర్జీలను, జగనన్నకు చెబుదాం రెవెన్యూ గ్రీవెన్స్ అర్జీలను సకాలంలోసంతప్తి మేరకు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వాలపై సమర భేరి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

అటు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ముందుకు సాగుతున్నాయి. అన్నింటి ధరలూ విపరీతంగా పెంచేస్తున్నాయి. కేంద్రంలోని మోడీ సర్కార్ పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసింది. వాటి ఫలితంగా నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయి. రాష్ట్రంలోని జగన్ సర్కార్ కూడా అదే బాటలో ముందుకు సాగుతోంది. విద్యుత్ చార్జీలు పెంచింది. ప్రజలపై మోయలేని భారాలను వేస్తోంది. ఆస్తి పన్ను పెంచింది. చెత్త పన్ను పేరుతో అదనంగా వసూలు చేస్తోంది. వాటితో పాటు రెండు ప్రభుత్వాలూ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సమర భేరి పేరుతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను, ప్రభుత్వాల వైఖరిని ప్రజల్లోకి తీసుకువెలుతున్నారు. రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సమస్యలపై సచివాలయాల ముందు ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. 4న మండల కేంద్రాలు, జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టనున్నారు.

ప్రాజెక్టులకు ఆగిన వరద...

జిల్లాలోని ప్రాజెక్టులకు వరద నీటి ప్రవాహం ఆగింది. ఎగువన వర్షాలు కురవకపోవడంతో శ్రీశైలం జలాశయానికి ఎగువ నుండి చుక్క నీరు కూడా రావడం లేదు. ఎగువన వర్షాలు కురవకపోవడంతో తుంగభద్ర జలాశయానికి అతి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. క్రమంగా ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గుతోంది.

జిల్లాలో సీపీఐ బస్సు యాత్ర..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా సీపీఐ చేపట్టిన బస్సు యాత్ర ఉమ్మడి జిల్లాలో సాగింది. తొలుత నంద్యాలలో రాష్ట్ర స్థాయి రైతు సదస్సు నిర్వహించారు. అనంతరం కర్నూలులో బహిరంగ సభ నిర్వచించారు. బస్సు యాత్రకు సీపీఎం, కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు.



ఉద్యమ సారథి రామకృష్ణ

ప్రజాశక్తి - నంద్యాల

ఉద్యమాల సారధి టి. రామకృష్ణ అని సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్ కొనియాడారు. శనివారం టి.రామకృష్ణ ఏడవ వర్ధంతి సభ నంద్యాల సిపిఎం కార్యాలయంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి. రామచంద్రుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా కార్యదర్శి డి .బాల హుసేని, సిపిఎం పట్టణ కార్యదర్శి నరసింహుడు, సిపిఎం నాయకులు బి రామరాజు, వెంకట లింగమయ్య, మాదాల శ్రీనివాసులు, సిఐటియు అధ్యక్షులు లక్ష్మణ, డివైఎఫ్ఐ నాయకులు శివ, రైతు సంఘం సంఘం జిల్లా నాయకులు సురేష్, సుధాకర్ పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టి. రామకృష్ణ ఆత్మకూర్ డివిజన్ వ్యాప్తంగా వ్యవసాయ కూలీలు, రైతులు, విద్యార్థి యువజనుల సమస్యలపైన రామకృష్ణ పోరాటాలు చేశారని, వేలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత ఆయనదే అన్నారు. దొంగతనాలకు వ్యతిరేక పోరాటాల్లో, పేదలకు ఇళ్ల స్థలాలను సాధించడంలోనూ రామకృష్ణ కీలక భూమిక పోషించారన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు నడుము బిగించాలని కోరారు. **ఆత్మకూరు :** టి రామకృష్ణ ఉద్యమ నేత అని ప్రముఖ వైద్యులు డాక్టర్ డి నాగన్న, సిపిఎం సీనియర్ నాయకులు ఏ రాజశేఖర్, బి. రామేశ్వరరావు, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్, పాముల పాడు మండల కార్యదర్శి స్వామన్నలు అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్ నందు తెప్పలి రామకృష్ణ ఏడవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభకు సిపిఎం సీనియర్ నాయకులు యాదాటి నాగేంద్రుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. రామకృష్ణ ఉద్యమ చరిత్రకు సంబంధించిన పాటలను ప్రజానాట్యం మండలి జిల్లా అధ్యక్షులు డి వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి సీనియర్ గాయకులు జోసఫ్ చంద్రశేఖర్, కురుకుందామా బాషా, యుగంధర్, తదితరులు పాడారు. కార్యక్రమంలో రామకృష్ణ కుటుం సభ్యులు, ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జి హనుమంతు, సీనియర్ పాత్రికేయులు చంద్ర శేఖర్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు డాలు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగన్న

భారాలపై ఉద్యమిద్దాం : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని, విద్యుత్ చార్జీలు తగ్గింపుకు ఆందోళనకు సిద్ధపడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని దామ గట్ల గ్రామంలో ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు వివిధ రూపాల్లో ఆందోళనలో భాగంగా గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరావు మాట్లాడుతూ నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఈనెల 4వ తారీఖున జరగబోయే ఆందోళన కార్యక్రమానికి కార్మికులు, కర్షకులు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నాయకులు పి పకీర్ సాహెబ్, టి గోపాలకష్ణ, టి ఓబులేష్, గ్రామస్తులు చిన్న స్వాములు, ప్రవీణ్, క్లాతిక్, చిన్న రాజు, సుధాకర్ ,ఏసన్న, తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూరు:** మండలం, సింగవరం సచివాలయం ఎదుట సిపిఎం నాయకులు టి రామచంద్రుడు, పార్టీ సభ్యులు రంగమ్మ రాయలమ్మ, రమణయ్య, తదితరులు సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు. **కొత్తపల్లి :** నిరుద్యోగం, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల నాయకులు ఎన్ స్వాములు, ఎస్ సంజీవ రాయుడు డిమాండ్ చేశారు. శనివారం మండల కమిటీ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలంలోని పెద్ద గుమ్మడాపురం శివపురం గ్రామపంచాయతీ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి ఏసన్న, జ్ఞాన సూర్యుడు, దేవకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బొల్లు ప్రసాద్, బాబు యాదవ్, గ్రామరైతులు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజా నాయకుడు వైఎస్ఆర్

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల కలెక్టరేట్ : ప్రజా నాయకుడు వైఎస్ఆర్ అని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెలే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాష, రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ పి పి నాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నాడు వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలను నంద్యాలలోని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి నివాసంలో నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్ సాయిబాబా నగర్ చమకాలువ సెంటర్లో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. జోహార్ వైయస్ఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన ఆయా రాష్ట్రాల్లో ప్రజల్లో గుండెల్లో నాటుకుపోయిన ఏకైక నాయకుడు వైఎస్ఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, ఫుడ్ ప్రాసెసింగ్ చైర్మన్ కల్లూరి రామలింగారెడ్డి, రాష్ట్ర బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి రాష్ట్ర దృశ్యకళలా డైరెక్టర్ సునీత, అమృత రాజ్, రాష్ట్రఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి , జేఏసీ కన్వీనర్లు సాయిరాం రెడ్డి, దాల్మిల్ అమీర్, సలముల్లా, నంద్యాల వైసీపీ జిల్లా జనరల్ సెక్రెటరీ రైల్వే శ్రీనివాసులు, జిల్లా వైఎస్ఆర్సిపి ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ,ఎస్టి సెల్ శంకర్ నాయక్, కౌన్సిలర్స్, వార్డు ఇన్చార్జిలు, కోఆప్షన్ సభ్యులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ స్మృతివనం నందు.. ఆత్మకూరు: జలయజ్ఞం పేరిట అనేక ప్రాజెక్టులను నిర్మించి సాగునీరు అందించిన ప్రధాత వైయస్ రాజశేఖర్ రెడ్డి అని శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆత్మకూరు మండలం నల్ల కాలువ గ్రామ సమీపాన ఉన్న వైఎస్ఆర్ స్మృతివనం నందు వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి, ఆత్మకూరు మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, ఎంపీపీ నల్లకాల తిరుపాలమ్మ, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు టౌన్ :** వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు శాసనసభ్యులు తొగురు ఆర్థర్ పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి , జిల్లా పార్టీ కార్యదర్శి డాక్టర్ వనజ ,జిల్లా యస్సీ విభాగం అధ్యక్షులు సగినెల వెంకట రమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బానీ వైసీపీ నాయకులు ఉండవల్లి ధర్మారెడ్డి, మొల్ల జాకీర్ హుస్సేన్, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు తొగట నాగార్జున, ప్రసాద్, షేక్ ఇనాయతుల్లా, వైసీపీ నాయకులు తమ్మడపల్లె విక్టర్, విశ్రాంత పోలీసు అధికారి పెరుమాల జాన్, నియోజకవర్గానికి చెందిన ఇతర వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. **మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో..** నందికొట్కూరు పట్టణంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకట స్వామి, ఎంపీపీ మురళీకృష్ణ రెడ్డి, తదితరులు వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్, ఉమ్మడి జిల్లాల మైనారిటీ జోనల్ ఇంఛార్జ్, సచివాలయ జెసియస్ కన్వీనర్ అబూబక్కర్, కౌన్సిలర్ లు పి.చాంద్ బాష, అబ్దుల్ రవూఫ్, మనపాడు అశోక్, లాలు ప్రసాద్ మరియు వైసిపి నాయకులు ఉస్మాన్ బేగ్, మన్సూర్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు అబ్దుల్ జబ్బార్, 80బన్నూరు సొసైటీ చైర్మన్ రమణ, తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు:** మండల కేంద్రంలో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే ఆర్థర్ హాజరై వైఎస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం భానుముక్కలలో కొన్ని కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీలో చేరారు. అనంతరం వైసిపి నాయకురాలు రాములమ్మ, పొదుపు మహిళలు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టారు. రమణారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ రామసుబ్బయ్య, బాలేశ్వర్ రెడ్డి, రాజన్న, స్వామి దాసు, జబ్బారు పాల్గొన్నారు.

- పాములపాడు మండలంలోని వైయస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేంపెంట సింగిల్ విండో సొసైటీ చైర్మన్ మచ్చ పెద్ద వెంకటస్వామి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారం మౌలాలి, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ టిఎన్ఆర్ నాగరాజు, నాయకులు చౌడయ్య పాల్గొన్నారు **ఆత్మకూర్:** పట్టణంలో నంద్యాల టర్నింగ్ లో ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారుఫ్ ఆసియా ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్, కౌన్సిలర్‌లు, వైసిపి పట్టణ అధ్యక్షులు ఎన్ఎస్ సయ్యద్, మీర్ శాలి పైల్వాన్, కుదుష్, తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి వైసిపి నేతలు నివాళులు అర్పించారు. ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, విజయ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డి,ఆళ్ళగడ్డ టౌన్ వైఎస్ఆర్సీపీ కన్వీనర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, ఆళ్ళగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గోపవరం నర్సింహా రెడ్డి ,వైఎస్సార్సీపీ నాయకులు గూబ గుండం వెంకట సుబ్బారెడ్డి, కోఆప్షన్ సభులు రమేష్ గౌడ్, మాదం చెన్నయ్య , శిల్ప కళా సంఘం యూనియన్ ప్రెసిడెంట్ బద్రి నీల కంటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** మండలంలో మండలం బుక్కాపురం గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్లను మండల అధికారులు, నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, జడ్పిటిసి కెవిఆర్ మహేశ్వర్ రెడ్డి, మహానంది దేవస్థానం చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. (మిగతా 6వ పేజీలో..)



వైయస్సార్ స్మృతి వనం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



వైఎస్ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎంపి, ఎమ్మెల్సీ, మార్కుఫెడ్ చైర్మన్, మున్సిపల్ చైర్ ఫర్సన్ తదితరులు



రోగులకు పండ్లు బ్రెడ్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



మహానంది : పేదలకు ఆర్థిక సాయం చేస్తున్న నాయకులు



రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ముగిసిన వరుణ పూజలు

ప్రజాశక్తి - శ్రీశైలం

లోకకళ్యాణం కోసం నిర్వహించే పూజలలో భాగంగా శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వరుణ జపాలు శనివారం ముగిశాయి. వర్షాభావ పరిస్థితులు తొలగి , సకాలంలో తగినంత వర్షాలు కురిసి రాష్ట్రంతో పాటు దేశం సుభిక్షంగా ఉండాలని సంకల్పంతో దేవస్థానం వరుణ జపాలను హోమాలను గత నెల 26 వ తేదీన ప్రారంబించిన ఈ కార్యక్రమం శనివారం నాడు జరిగిన పూర్ణాహుతి కార్యక్రమం తో హెూమాలు జపాలు ముగిశాయి . పూర్ణాహుతి కార్యక్రమం లో పలుసుగంధ ద్రవ్యాలు,నూతన వస్త్రాలను హోమ గుండంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి ఎస్ లవన్న, ఉబయ దేవాలయాల ప్రధాన అర్చకులు వేద పండితులు పాల్గొన్నారు.

తోటమాలి కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

తోటమాలి కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు చెల్లించాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వై. ఆశీర్వాదం డిమాండ్ చేశారు. సుండిపెంట కాలనీలో ఐఎఫ్టియు కార్యాలయంలో శనివారం వై. ఆశీర్వాదం మాట్లాడుతూ పుణ్యక్షేత్రానికి కోట్ల రూపాయల ఆదాయం పెరుగుతుందని, దినదినము క్షేత్రం అభివద్ధి అయినప్పటికీ కానీ పేదవాడికి జీతాలు పెంచకపోవడం సకాలంలో ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. అధికార పార్టీ లోని కొంత మంది నాయకులు నుండి కార్మికులను యూనియన్లు పెడితే తొలగిస్తామని మాట్లాడటం బాధాకరం అన్నారు. నాలుగు నెలల నుంచి జీతాలు రాక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నప్పుడు ఎందుకు జీతాలు ఇవ్వలేక పోయారన్నారు. తక్షణమే దేవస్థానం ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు జీతాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

అగ్నిప్రమాదంలో గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి - రుద్రవరం



మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డివాములు దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు వివరాల మేరకు గ్రామానికి చెందిన మునగాల నరసింహారెడ్డి అనే రైతుకు చెందిన గడ్డివాముల దగ్గర మంటలు వ్యాపించి రెండు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి అన్నారు. ఈ ప్రమాదంలో రూ. 1లక్ష విలువ చేసే పశుగ్రాసము పూర్తిగా దగ్ధమైందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి ఆళ్లగడ్డ అగ్నిమాపకదల సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పి వేశారు. పశు గ్రాసం నష్టపోయిన రైతుకు ప్రభుత్వము ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరారు.

ఆ రెవెన్యూ ఉద్యోగిపై వేటు తప్పదా!

- నిభంధనలను బేఖాతర్ చేసిన ఉద్యోగుల్లో ముచ్చెమటలు ?

- ప్రజాశక్తి కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ ?

ప్రజాశక్తి - నందికొట్కూర్

నందికొట్కూరు తహసిల్దార్ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా కలెక్టర్ ఆదేశాలు లెక్కచేయకుండా కలెక్టర్ ఆర్డర్‌ను ధిక్కరించి గత పది సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తున్న ఒక రెవెన్యూ ఉద్యోగిపై వేటు పడనున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రజాశక్తి కథనానికి నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ స్పందించి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. గత రెండు రోజుల క్రితం ఆ వీఆర్వోకు బదిలీలు వర్తించవా అంటూ ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనం పాఠకులకు విధితమే. నంద్యాల జిల్లా కలెక్టర్ ఇప్పటికే విచారణకు ఆదేశించినట్లు కార్యాలయం లో సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఇంచార్జి తహశీల్దార్ పుల్లయ్య ఏ



ద్యోగి ఎక్కడ ఎక్కడ పని చేస్తున్నారు.. కలెక్టర్ ఆర్డర్ ప్రకారమే పనిచేస్తు న్నారా లేక సొంతంగా తహసీల్దార్ ఇచ్చిన ఆర్డర్ ప్రకారం పనిచేస్తున్నారా అనే విషయంపై విచారిస్తున్నట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలను లెక్కచేయకుండా బదిలీ ఆర్డర్ వచ్చినా కూడా వెళ్లకుండా, గత పది ఏళ్లుగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తూ, ఒకే కార్యాలయంలో జీతాలు తీసుకుంటూ ఉన్నారని పలువురు అధికారులు కూడా ఒకరికొకరు చర్చించుకుంటున్నారు.

జీతాల చెల్లింపుపై ఆరా..

ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా బదిలీ చేసినట్లు కలెక్టర్ ఆర్డర్ వచ్చిన తర్వాత సంబంధిత కార్యాలయంలో రిపోర్టు చేయాలి. ఏ కార్యాలయంలో అయితే రిపోర్టు చేస్తారో విధులు అక్కడే నిర్వహించాలి, జీతాలు కూడా అక్కడే పెట్టుకోవాలి. కానీ ఇక్కడ పనిచేస్తున్న ఒక విఆర్ఓకు బదిలీ నాలుగేళ్ల క్రితం వచ్చినా కూడా కలెక్టర్ ఆర్డర్‌ను ధిక్కరించి ఇక్కడే ఉంటూ నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నారు. ఆయన పనిచేయడమే కాకుండా ఇక్కడ ఉన్న కొందరు ఉన్నతాధికారులు ఈయనకు నిబంధనలకు విరుద్ధంగా గత నాలుగేళ్లుగా జీతాలు చెల్లించారని ఈ విషయంపై నిబంధన లకు విరుద్ధంగా జీతాలు ఎలా చెల్లించారని పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు సమాచారం. కలెక్టర్ ఆర్డర్ లెక్కచేయకుండా పదేళ్ళ పాటు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరడంతో ప్రజాశక్తి వెలుగులోకి తేవడం, కలెక్టర్ కూడా వెంటనే స్పందించడంతో మండల ప్రజలు ప్రజాశక్తికి అభినందనలు తెలుపుతున్నారు.

ఘనంగా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు నియోజకవర్గ జనసేన నాయకులు మైలేరి మల్లయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్రియాశీల సభ్యులకు సభ్యత్వ కిట్ల పంపిణీ చేశారు. రక్తదానం చేసి, పారిశుద్ధ కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి, అభిమానులతో ర్యాలీగా వెళ్లి నాలుగు రోడ్ల సర్కిల్ లో మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మైలేరి మల్లయ్య మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ఓడించే బాధ్యత జనసైనికులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైలారు శ్రీరాములు, వెంకటసుబ్బయ్య, నరేంద్ర యాదవ్, మహబూబ్ దౌల, దూదేకుల బాబు, జమాల్ బాషా, సురేంద్ర, కుమార్ ,మహబూబ్ బాషా, మద్దిలేటి యాదవ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** కోవెలకుంట్లలోని అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణంలోని కళ్యాణమండపంలో జనసేన నాయకులు పత్తి సురేష్ బాబు, దోడియం గురప్ప, నాగ ప్రసాద్, కిట్టు, చిన్న బాబు, భోధనం ఓబులేసు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులతో సహపంక్తి భోజనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు నరసింహ, అఖిల్, జస్వంత్ రెడ్డి, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని ఆర్ కొత్తూరు గ్రామంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. అలాగే గ్రామ సమీపంలో ఉన్న రచ్చబండ దగ్గర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అభిమానులు మాట్లాడుతూ పవన్ రాజకీయాలలో చురుగ్గా రాణించాలని ఆకాంక్షించారు. మేకల హర్షవర్ధన్, గురు వెంకటేష్, బాల గుర్రప్ప , మల్లెల రామిరెడ్డి మందపాటి జగదీష్ పలువురు అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రి పట్టణంలో చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు అవులు నరసింహ ప్రతాప్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జరిపారు. స్థానిక బ్రహ్మంగారి మఠం సమీపంలో కేక్ కట్ చేసి సంబరాలు. జరిపారు. కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమాన సంఘం నాయకులు పొల్లకాయల హరిక్రిష్ణ, ప్రవీణ్, మొహిద్దీన్, రాఘవ, విష్ణువర్ధన్, నరేష్, చోటు, బలందర్, ప్రణయ్, విష్ణు, హరి, యోగి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలో సినీ హీరో, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలో జనసేన నాయకులు భాస్కర్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రక్తదాన శిబిరం, హుసేనాపురం గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులకు పుస్తకాలు, ఐడెంటి కార్డులు పంపిణీ చేశారు. పట్టణం లోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు రక్త కొరత ఏర్పడిందని అందువల్ల రక్తదానం కార్యక్రమం ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని జనసైనికులతో రక్తదానం చేయించినట్లు భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు భాస్కర్ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ జిల్లా సభ్యులు చినబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేసే దిశగా కృషి చేస్తామని, త్వరలోనే వారాహి యాత్ర రాయలసీమలో మొదలు పెట్టబో తున్నాడని తెలిపారు. కార్యక్రమంలో బనగానపల్లె, కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండల నాయకులు మహబూబ్ బాషా, పృథ్వి, అజిత్ రెడ్డి, రాజు కుల్లాయి, జనసైనికులు సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.





కోవెలకుంట్ల : రక్తదానం చేస్తున్న జనసేన నాయకులు



బనగానపల్లె : రక్తదానం చేస్తున్న జనసేన నాయకులు

అప్పల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తపల్లి



నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలో అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎఎస్ఐ బాబా పక్రుద్దీన్ తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లి నందికుంట గ్రామానికి చెందిన వంగల సుబ్బారెడ్డి (49) గత ఏడాది 15 ఎకరాలు పొలం కౌలుకు తీసుకున్నారు. ఈ ఏడాది కూడా 5 ఎకరాలు పోలం కౌలుకు తీసుకున్నారు. అయితే గత ఏడాది అధిక వర్షాల కారణంగా 15 ఎకరాల్లో వేసిన పత్తి, మొక్కజొన్న పంటలు దెబ్బతిని నష్టం వచ్చింది. ఈ ఏడాది 5 ఎకరాలలో వేసిన పంటలకు వర్షాభావం వల్ల పంటలు పూర్తిగా ఎండిపోయింది. సుబ్బారెడ్డి పంటల సాగుకోసం రూ. 6 లక్షలు పైగా అప్పుచేశాడు. పంటలు పూర్తిగా దెబ్బతినడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక గతనెల 30న ఇంట్లో ఎవ్వరులేని సమయంలో పురుగు మందు తాగాడు. తర్వాత విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహాయంతో ప్రథమ చికిత్స కోసం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య మహేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న గౌరు వెంకట్‌రెడ్డి

రైతాంగాన్ని వేదిస్తున్న విద్యుత్ కోతలు

- గౌరు వెంకట్‌రెడ్డి

ప్రజాశక్తి-నందికొట్కూరు టౌన్

గత రెండు నెలలుగా వ్యవసాయానికి పగటిపూట కరెంటు లేకపోవడం వల్ల, విద్యుత్ కోతల వల్ల రైతాంగం అనేక ఇబ్బందులు గురవుతున్నారని నంద్యాల పార్లమెంట్ టిడిపి మాజీ అధ్యక్షులు గౌరు వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రైతులకు న్యాయనమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలు లేక ఎండిపోతున్న పంటలకు విద్యుత్ కోతులతో నీళ్లు పెట్టుకునేందుకు కూడా వీలు లేకుండా ఉందని అన్నారు. రైతులకు 9 గంటల విద్యుత్తును ఇచ్చి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్‌లో సరైన వర్షపాతం నమోదు కాక వేసిన పంటలు ఎండిపోయి రైతులు విలవిల్లాడుతుంటే ఒకవైపు బోరుబావుల కింద సాగు చేసిన పంటలు సమయానికి కరెంటు లేక, కరెంటు కోతలతో బోరుబావుల కింద వేసిన పంటలు సైతం ఎండిపోతున్నాయని తెలిపారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వివరిస్తుందని విమర్శించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్తును 9 గంటల సరఫరాచేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి పగటిపూట కరెంటు ఇవ్వాలని నందికొట్కూరు నియోజకవర్గంలోని విద్యుత్ సబ్ స్టేషన్ దగ్గర రైతులు ధర్నా చేసినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. ఒక పక్క వర్షాలు లేక నదులలో నీరులేవని, బోరుబావుల ద్వారా పంటలను కాపాడుకోవాలకుంటున్న రైతులకు విద్యుత్ కోతలు మూలిగే నక్కపై టాటికాయ పడ్డ చందంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజా నాయకుడు వైఎస్ఆర్

(5వ పేజీ తరువాయి..)

చాగలమర్రి : వైసీపీ రాష్ట మైనార్టీ సెల్ కార్యదర్శి బాబులాల్, ఎంపిపి వీరభద్రుడు,మండల కన్వీనర్ కుమార్ రెడ్డిలు చాగలమర్రి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైసీపీ నాయకులు,కార్యకర్తలు భారీగా ర్యాలీగా తరలి వెళ్ళి పెద్దమకానం వద్ద గల వైయస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ముత్యాలపాడు గ్రామంలో వైసీపీ నాయకులు శేషురమేష్,శెట్టివీడు గ్రామంలో మండల కన్వీనర్ కుమార్ రెడ్డి,రాంపల్లెలో నరసింహ, రామకృ ష్ణల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి,ఎంపీటీసి ఫయాజ్మార్కెట్ యార్డు డైరెక్టర్ జాబీర్,మండల కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. **ప్యాపిలి:** స్థానిక పంచాయతీ కార్యాలయంలో జెడ్పిటిసి బోరెడ్డి శ్రీరామ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. బొర్రా మల్లికార్జునరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కొండయ్య, మద్దయ్య,పర్వతం శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి,షైక్షావలి, రామకృష్ణ పాల్గొన్నారు. **రుద్రవరం:** ప్రజల నాయకుడు వైఎస్ఆర్ అని ఎంపీపీ మబ్బు బాలస్వామి, వైసీపీ నాయకులు బైరి బ్రహ్మం, బైరి శంకర్‌లు అన్నారు. రుద్రవరంలోని అమ్మవారి శాల సెంటర్‌లో వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరము ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పండ్లు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో దేవగుడి జాకీర్ హుస్సేన్,కొల్లం చిన్న నరసింహులు, గొల్ల పెద్దన్న, లింగం బ్రహ్మయ్య, లొడుగు నరసింహులు, లాజర్, సైమన్, సామెల్, పుట్ట శౌరి,వెంకట చంద్రుడు, ఔట శ్రీను కార్యకర్తలు, కన్వీనర్లు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** రాజన్న సంక్షేమ పథకాలు పేద ప్రజల గుండెల్లో చిరస్మరణీయమని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలుకూరు గ్రామంలో వైయస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైసిపి నాయకులు గుండం భాస్కర్ రెడ్డి, తిరుమలరెడ్డి ,సచివాలయం కన్వీనర్లు వెంకట సుబ్బారెడ్డి, కాటసాని పుల్లారెడ్డి, వడ్డే వెంకటేష్, కార్పెంటర్ రాము , జగదీశ్వర్ రెడ్డి, రాంబాబు, శ్రీకాంత్, యోహాను, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఓబుల్ ఆధ్వర్యంలో..** వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి, వైసీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు పట్టణంలోని అవుకు మెట్ట వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు,బ్రెడ్ లను పంపిణీ చేశారు. యాగంటి దేవస్థానం చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, రైతు సంఘం మాజీ అధ్యక్షుడు మంగవరపు శివరామిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు:** మండలంలోని బ్రాహ్మణ కొట్టుకూరు గ్రామంలో వైయస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, సహకార సొసైటీ చైర్మన్ 80- బన్నూరు వైవి రమణ,సర్పంచ్, ఆర్ఎంపీ డాక్టర్ సుధాకర్, మరియమ్మ, దామ గట్ల ఉపసర్పంచ్ ఏసురత్నం, వైఎస్ఆర్సిపి నాయకులు రవీంద్రబాబు, ఎంపీటీసీ నాగేశ్వరరావు, కాటే పోగు సురేష్, మారుతి నగర్ ఏసన్న, రాజు, పాపన్న,తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** నగర పంచాయతీ చైర్మన్ రెడ్డి ఆధ్వర్యంలో బేతంచర్లలో వైయస్సార్ కార్యాలయం నుండి బైక్ ర్యాలీ నిర్వహించి వైఎస్ఆర్ విగ్రహం కు పూమాలలు వేసి నివాళులు అర్పించారు. వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళి కృష్ణ, కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, రామళ్లకోట కృష్ణుడు, చంద్రశేఖర్, సముదాని భాష, రామానాయుడు, వెంకటేష్, నడ్డి శ్రీనివాసులు, భాస్కర్, దస్తగిరి నాయకులు పాల్గొన్నారు.




కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో **నంద్యాల:** స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి నంద్యాల టౌన్ అధ్యక్షులు దాసరి చింతలయ్య పూల మాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా సెక్రటరీ అబ్దుల్ రహిమాన్, టౌన్ ఉపాధ్యక్షులు శివ, రామిరెడ్డి, చాబోలు సలాం రియాజ్, ఆనందరావ్, మహిళా అధ్యక్షురాలు విజయక్క, నాయకులు పాల్గొన్నారు.



రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు



ప్యాపిలిలో..



డోన్ : మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ నాయకత్వంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పిస్తున్న శ్రీరాములు, జాకీర్ హుస్సేన్, దినేష్



పాములపాడులో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి



చాగలమర్రి: వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైసిపి నాయకులు



ఈ ఈ ఉమామహేశ్వరం సన్మానిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఇఇ పనితీరు అభినందనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

హౌసింగ్ ఈఈగా పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు రిటైర్మెంట్ బాధాకరమని అయినప్పటికీ ఉద్యోగ ప్రక్రియలో ఆయన చేసిన సేవలు ప్రజలు గుర్తుంచుకుంటారని శ్రీశైలం నియోజవర్గ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శనివారం నాడు ఆత్మకూరు టౌన్ శ్రీ జగద్గురు మఠం నందు డిప్యూటీ ఈఈ ఉమామహేశ్వర పదవి విరమణ మహెూత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఉమామహేశ్వర్ దంపతుల ను సన్మానించారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతల విషయంలో ఎమ్మెల్యే ప్రోత్సహం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, తదితరులు పాల్గొన్నారు.

విధులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సచివాలయ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని, అలసత్వం ప్రదర్శించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి సిబ్బందిని హెచ్చరించారు. శనివారం మునిసిపల్ కమిషనర్ విజయపురి కాలనీ, వెంకటాచలం కాలనీ, దేవనగర్ 1, దేవనగర్ 2 వార్డు సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. సర్వీసులు,స్పందన, రిజిష్టర్‌ల నిర్వహణపై సంబంధిత సెక్రటేరిలకు ఆదేశాలు జారీ చేశారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి -రుద్రవరం

మండలంలోని కొండమాయపల్లి పంచాయతీ వెలగల పల్లె గ్రామం పొలిమేరలో వెలసిన శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి దేవస్థానము శనివారం బాలాలయ నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు రంగనా యకులు, కోశాధికారి నరసింహులు, గౌరవ అధ్యక్షులు డాక్టర్ హరినాథ్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసన్న దంపతులు, ఆర్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ, కమిటీ సభ్యులు ఓబులయ్య, గంధం రఘునాథరెడ్డి రామకృష్ణారెడ్డి, మాధవి లత దంపతులు మునగాల రామకష్టారెడ్డి డాక్టర్ కేశవరెడ్డి డాక్టర్ సుదర్శన్ రెడ్డి సింగతల నాగిరెడ్డి శ్రీనివాసులు ఎస్ రామచంద్రారెడ్డి ఎస్ హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. విరాళాలు ఇచ్చు వారు కమిటీ వారిని సంప్రదించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



బాలాలయ నిర్మాణం కోసం భూమి పూజ చేస్తున్న నిర్వాహకులు

తప్పుడు సాక్ష్యం చెప్పించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- డోన్ డిఎస్‌పికి కెవిపిఎస్ ఫిర్యాదు

ప్రజాశక్తి-డోన్




మాట్లాడుతున్న కెవిపిఎస్ నాయకులు

కాల్ మనీ కేసులో న్యాయస్థానాలకు న్యాయ వ్యవస్థల కళ్లకు గంతలు కట్టి తప్పుడు సాక్ష్యం చెప్పిం చిన వారిపై చర్యలు తీసుకోవాని నంద్యాల డిఎస్‌పికి కెవిపిఎస్ నంద్యాల జిల్లా నాయకులు రాజ్‌కుమార్ నాయకత్వంలో బాధితులు శనివారం వినతిపత్రం అందజేశారు. కాల్ మనీకేసులో సాక్షుల సంతకాలను ఫోర్జరీ చేస్తూ, కేసులో సాక్షులుగా ఉన్న వారిని కాకుండా మరొక వ్యక్తిని ప్రవేశ ప్రవేశపెడుతున్న ముద్దాయిలు బండల ఈశ్వరయ్య, అతని తరుపు లాయర్, అందుకు సహకరించిన డోన్ కోర్ట్ కానిస్టేబుల్, టౌన్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్ట్ పిపి పైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాజ్‌కుమార్ కోరారు. నంద్యాల జిల్లా డోన్‌లో నివసిస్తున్న ఎస్.ఎం.వలి తండ్రి అబ్దుల్ ఖరీం డోన్ పట్టణంలోని కొద్ది మంది వ్యక్తులు ఎలాంటి ప్రభుత్వ లైసెన్స్ లేకుండానే అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ, బాధితుల ఆర్థిక హీనతను అసరా చేసుకొని వారి వద్ద నుంచి ఖాళీ బాండ్లు, చెక్కులు తీసుకుని వాటిపైనే సంతకాలు చేయించుకుని అప్పు చెల్లించినా సరే అవి చించి వేయడం లేదని పేర్కొన్నారు. అవి తిరిగి ఇవ్వకుండగా వారి దగ్గరనే ఉంచుకొని మీరు ఇంకా అప్పు ఉన్నారంటూ వడ్డీ మాఫియా రాబందుల ఆగడాలను భరించలేక ఆనాటి జిల్లా ఎస్‌పిని ఆశ్రయించారన్నారు. తర్వాత ఎస్‌పి ఆదేశాల మేరకు డోన్ పట్టణంలోని బాధిత మహిళలు2015 లో కేసు పెట్టారు. 404/2015 ఎఫ్ఐఆర్ నమోదయిందన్నారు. ఎస్ఎం వలి అతను15వ సాక్షిగా వున్నారు. అయితే సాక్షుల విచారణ సందర్భముగా 15వ సాక్షిగా ఉన్న వలికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే తప్పుడు వ్యక్తితో కోర్టు కానిస్టేబుల్ సాక్షం చెప్పించారు. పిపి కూడా ఆధార్ కార్డు కూడా పరిశీలన చేయకుండానే సాక్షిని విచారించారు. కాల్ మనీ కేసులో తప్పుడు వ్యక్తిని సాక్షిగా ప్రవేశ పెట్టిన విచారించిన కోర్టు కానిస్టేబుల్ , పిపి. లపై కేసు నమోదు చేయించి చర్యలు తీసుకొమని గతంలో రెండవ దఫా 2023లో ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లామన్నారు. తర్వాత విచారణ చేసివారిని అరెస్టు చేస్తాం అని హామీ ఇచ్చారన్నారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వారిని వదిలేశారని పేర్కొన్నారు. పట్టణంలో అత్యధిక వడ్డీలు వసూలు చేస్తూ జనాల రక్తాన్ని పీల్చుకు తింటున్న రాబందు వడ్డీ మాఫియా నుండి బాధితులకు సాక్షులకు రక్షణ కల్పించాలన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడి

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామంలో శనివారం టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జయసూర్య ఆధ్వర్యంలో రైతులు సబ్ స్టేషన్ ముట్టడి చేశారు. ఈ సందర్భంగా జయ సూర్య మాట్లాడుతూ పగటి పూట తొమ్మిది గంటల కరెంటు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. బావుల కింద బోర్ల కింద వేసిన పంటలు ఎండిపోతున్న ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయమని అన్నారు. రైతులకు పగటిపూట తొమ్మిది గంటల్లో కరెంటు ఇచ్చేంతవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఓబుల్ రెడ్డి, ఐ టి డి పి ముర్తుజావలి, తెలుగు యువత ప్రభు కుమార్, సిపిఎం రైతు సంఘం నాయకులు రాజు, వెంకటేశ్వర్లు, రంగస్వామి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య బృందం

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో ఉన్న మురికికుంటలపై వ్యాప్తి చెందుతున్న దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకొని గ్రామాల్లో ప్రబలుతున్న విష జ్వరాల పట్ల వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ కాంతారావు నాయక్, జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావులు సూచించారు. శనివారం కొత్తపల్లి మండలం ఎర్రమఠం గ్రామంలో జిల్లా వైద్యాధికారుల బృందం పర్యటించి పలు సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయని విష జ్వరాల పట్ల వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండి ఎల్లప్పుడు వైద్య సేవలు అందిస్తూ ఉండాలన్నారు. ఆత్మకూరు సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో మేరీ, ఇఒఆర్‌డి శ్రీనివాసులు నాయుడు, అధికారులు ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా వైద్య బృందం